క్లుప్తంగా

8వ తేదీ వరకు డిగ్రీ ప్రవేశాలకు గడువు

మక్తల్: డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం దోస్త్–2025 రెండో విడుత రిజిస్ట్రేషన్ చేయడానికి ఈనెల 8 వరకు అవకాశం ఉందని మక్తల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నారాయణ గౌడ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రెండో విడుత ప్రవేశాలకు కళాశాల అధ్యాపకులు పోస్టర్ విడుదల చేశారు. విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి 3 నెలల రేషన్ బియ్యం పంపిణీ

కొత్తపల్లి: కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 3 నెలలకు సంబంధించిన ఉచిత రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు ఆదివారం నుంచి పంపిణీ చేయనున్నట్లు ఎన్‌ఫోర్స్ మెంట్ డిప్యుటీ తహసీల్దార్ ఆనంద్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించిన సన్న బియ్యాన్ని లబ్ధిదారులకు ఒకేసారి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బియ్యం పంపిణీలో భాగంగా రేషన్ దుకాణాలు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అలాగే సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచే ఉంటాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యాన్ని ఎవరైనా పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

3 నుంచి భూ భారతి రెవెన్యూ సదస్సులు

కొత్తపల్లి: భూ భారతి చట్టం అమలులో భాగంగా ఈ నెల 3వ తేదీ నుంచి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయరాములు ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. 3న లింగాల్ చేడ్, పెద్దాపూర్, 4న అల్లీపూర్, మన్నాపూర్, 5న తిమ్మారెడ్డి పల్లి, నందిగామ, 6న దుప్పడి గట్టు, గోకుల్ నగర్, 9న నిడ్జింత, 10న భూనీడు, 11న కొత్త పల్లి మండల కేంద్రంలో సదస్సులు ఏర్పాటు చేయనునట్లు తెలిపారు. భూ సమస్యలు ఉన్న రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులను పునఃపరిశీలించాలి

ఊట్కూరు: ప్రభుత్వం చేపట్టిన టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులను పునః పరిశీలించాలని తాపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహా, కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచాలని, నాణ్యమైన విద్య అందించాలని ప్రభుత్వం మాటలు చెబుతున్నా.. పాఠశాలలో సరైన ఉపాధ్యాయులు లేక విద్యాబోధన సక్రమంగా జరగడం లేదన్నారు. 30 మంది విద్యార్థులు ఉంటే ఇద్దరు ఉపాధ్యాయులు, 60 మంది విద్యార్థులు ఉంటే నలుగురు ఉపాధ్యాయులు ఉండే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులను సరి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉంటేనే పాఠశాలలో హాజరు శాతం పెరుగుతుందని తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

కొత్తపల్లి: మండల పరిధిలోని వాగు పరిసర గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఆదివారం కూడా లింగాల్ చేడ్ వాగు తిమ్మారెడ్డి పల్లి బ్రిడ్జి సమీపం నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలించారు. దీనిపై తహసీల్దార్ జయరాములును వివరణ కోరగా ఆదివారం సెలవు దినం కావడంతో పర్యవేక్షణ లేకపోవడంతో ఇసుకను తరలించి ఉండవచ్చన్నారు. ఇప్పటి నుంచి వాగు పరిసర ప్రాంతాల్లో నిఘా పెట్టి ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు.

బైక్ పై నుంచి పడి గాయాలు

మక్తల్: మండలంలోని కాచ్‌వార్ శివారులో టోల్ గేట్ దగ్గర మక్తల్‌కు చెందిన రిటైర్డు టీచర్ చంద్రశేఖర్ ద్విచక్రవాహనంపై వస్తూ అదుపు తప్పి కిందపడడంతో తలకు తీవ్రగాయమైంది. స్థానికులు గమనించి 108లో మక్తల్ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం జిల్లా అసుపత్రికి తరలించారు. అలాగే మండల పరిధిలో జరిగిన ఇంకొక రోడ్డు ప్రమాదంలో ఖానాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి.

జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలి

ఆత్మకూర్: క్రీడాకారులు గ్రామీణ ప్రాంతాలకే పరిమితం కాకుండా జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని డీకే కృష్ణ జువెల్లర్స్ అధినేత విశ్వప్రకాష్ అన్నారు. స్థానిక జాతర మైదానంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం కొనసాగాయి. మొత్తం 36 జట్లు పోటీపడుతున్న ఈ పోటీల్లో విజేతకు మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం రూ.50,116, రెండో బహుమతి రూ.30,116 నగదుతో పాటు షీల్డులను అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో నిర్వాహకులు అరుణ్, అనుదీప్, ఇమ్రాన్, అఫ్రోజ్, అస్లాం, రాకేష్, నాని, మహేందర్, భరత్, శ్రీకాంత్, గాండ్లశివ, శ్రీధర్, నవీన్, కోచ్ ఖాదర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లు.. తప్పని ఇక్కట్లు

- గుంతలు, కంకర తేలిన వైనం
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు


అధ్వానంగా తయారైన మాగనూర్ - అచ్చంపేట రోడ్డు

మాగనూర్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో లింక్ రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ రాజ్‌శాఖ ఆధ్వర్యంలో ఉన్న రోడ్లన్నీ బీటీకి నోచుకోక దశాబ్దం కిందట వేసినవి కావడంతో రోడ్డు కంకర తేలి అధ్వానంగా తయారయ్యాయి. మండలంలో మొత్తం 16 గ్రామ పంచాయతీలు ఉండగా దాదాపు అన్ని చోట్ల గుంతలు పడిన రోడ్లు లేదా మట్టి రోడ్లు ఉండడంతో ఎక్కడికైనా వెళ్లాలంటే నరకయాతన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. కాస్త వర్షం పడితే మట్టి రోడ్లు బురదమయంగా మారుతుండడంతో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీటీ రోడ్డుకు నోచుకోలేక..

మండల కేంద్రం నుంచి దాదాపుగా (ఒబ్లాపూర్, నేరడగందొడ్డి, బైరంపల్లి, పెగడబండ, అచ్చంపేట్, అమ్మపల్లి, పర్మన్‌దొడ్డి, గజ్జరందొడ్డి, పూంజనూర్) 10 గ్రామాలు బీటీ రోడ్డుకు నోచుకోవడం లేదు. ఏ చిన్న అవసరం వచ్చినా మండల కేంద్రానికి గుంతలమయంగా మారిన రోడ్డుపైనే ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆరోగ్య కేంద్రం, పశువుల ఆస్పత్రి, మీ సేవ, బ్యాంకు , ప్రభుత్వ కార్యాలయాల కోసం వివిధ గ్రామాల ప్రజలు మాగనూర్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్లు అస్తవ్యస్తంగా మారడంతో అవస్థలు తప్పడం లేదు.

గ్రామాలలోకి రాని ఆర్టీసీ బస్సులు..

రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతో పలు గ్రామాలకు ఇప్పటికీ ఆర్టీసీ బస్సులు రావడం లేదు. దీంతో ప్రజలు ప్రైవేట్ వాహనాలనే ఆశ్రయిస్తున్నారు. అత్యవసరం అయినప్పుడు అంబులెన్సు డ్రైవర్లు సైతం పేషెంట్లను గ్రామాల నుంచి మండల కేంద్రానికి తీసుకురావడానికి జంక్కుతున్నారు. అధికారులు స్పందించి రవాణా సదుపాయాలు సరిగా లేని గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరు చేసి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి కోరుతున్నారు.

రోడ్డు బాగు చేయాలి



మాది గజ్జరందొడ్డి గ్రామం. గ్రామంలో రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారడంతో అత్యవసర సమయాల్లో ప్రైవేట్ వాహనాల్లో వెళ్తూ ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. రోడ్డును బాగు చేయాలని గతంలో అనేక మంది నాయకులు, అధికారులకు విన్నవించాం. అయినా ఇంతవరకు పట్టించుకున్న నాథుడు లేరు.

–వెంకట్‌రెడ్డి, గజ్జరందొడ్డి గ్రామం

ప్రమాదాలకు గురవుతున్నారు



అచ్చంపేట్ గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లాలంటే పెద్ద చెరువు అలుగు దగ్గర నుంచి రావాల్సి ఉంటుంది. అయితే ఈ మధ్య కురుస్తున్న వర్షాలతో బురదమయంగా మారిన రహదారితో ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు జారి పడి గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి మాగనూర్ నుంచి గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలి.

–నర్సింములు, వడ్వాట్, మాజీ సర్పంచ్

ప్రతిపాదనలు పంపించాం



మండలంలోని పలు గ్రామాలకు బీటీ రోడ్డుకు ప్రతిపాదనలు పంపించాం. దీంతో అధికారులు ఇటీవల మండంలోని అచ్చంపేటకు బీటీ రోడ్డు మంజూరు చేశారు. నిధులు పూర్తి స్థాయిలో మంజూరు కాగానే మిగిలిన గ్రామాలకు కూడా బీటీ రోడ్డు పనులు ప్రారంభిస్తాం.

– మారుతీ, పంచాయితీ రాజ్ ఏఈ

నేడు రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

మక్తల్: రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉద్యమకారుడు నీలప్ప ముదిరాజ్ తెలిపారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని నారాయణపేట క్రాస్ రోడ్డు దగ్గర ఉదయం 9:30 గంటలకు వేడుకలు జరపనున్నట్లు పేర్కొన్నారు. పతకావిష్కరణ కార్యక్రమానికి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, నారాయణపేట జిల్లా జెడ్పీ చైర్మన్ వనజ, బీకేఆర్ చైర్మన్ బాలకృష్టా రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచు సూర్యనారాయణలు హాజరవుతారన్నారు.

నర్వ: మండల కేంద్రంలో నేడు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరవుతారని నాయకులు, కార్యకర్తలు పెద్దెత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలి


ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

మరికల్: మండలంలోని కన్మనూర్‌లో ఇళ్ల మధ్యన ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. గ్రామానికి, వ్యవసాయ పొలాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు గ్రామంలో 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు, బురద నిలవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయాన్ని ట్రాన్స్‌కో అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. వర్షాకాలంలో ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ శుభ్రం చేసి కంచె నిర్మించాలని కోరుతున్నారు.

మురుగు సమస్యను పరిష్కరిస్తాం


మురుగు కాలువను పరిశీలిస్తున్న అధికారులు

మాగనూర్: మండల కేంద్రంలో మురుగు సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని పంచాయతీ రాజ్ ఏఈ మారుతీ తెలిపారు. 10వ వార్డులో మురుగు ముందుకు వెళ్లక పోవడంతో దుర్వాసన వెదజల్లి తీవ్ర ఇబ్బందులు స్థానిక ప్రజలు ఇటీవల పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆదివారం పంచాయతీ కార్యదర్శి తిమ్మప్పతో కలిసి పంచాయతీ రాజ్ ఏఈ మారుతీ మురుగు కాలువను పరిశీలించారు. గతంలో ఎన్‌హెచ్–167 రహదారి ఎత్తు పెంచడంతో మురుగు ఈ ప్రాంతం మొత్తం గుంతగా మారిందని దీంతో మురుగు ముందుకు వెళ్లడం లేదని తెలిపారు. మురుగు నిలిచి దుర్వాసన వస్తుండడంతో పాటు దోమల బెడద అధికంగా ప్రజలు వివరించడంతో నూతన మురుగు కాలువను నిర్మించి సమస్యను పరిష్కరిస్తామని ఏఈ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రాజు, కాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు దండు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రహదారి ఏర్పాటు చేయాలి


గుంతల మయంగా లక్కర్‌దొడ్డి గ్రామ రహదారి

నర్వ: మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న లక్కర్‌దొడ్డి గ్రామానికి బీటీ రహదారి కలగానే మిగిలిందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామానికి వెళ్లే రహదారి గుంతలమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఐదేళ్లకోసారి పాలకులు మారుతున్నారు తప్ప తమ గ్రామ రహదారిని బాగుచేయడం లేదన్నారు. వర్షకాలం వచ్చిందంటే చాలు ఈ మార్గం బురదమయంగా మారుతుండడంతో రాకపోకలకు తీవ్ర కష్టాలు పడుతున్నామని పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి నర్వ నుంచి లక్కర్‌దొడ్డి మీదుగా కొత్తపల్లి, పెద్దకడ్మూర్ గ్రామాల వరకు బీటీ రహదారి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నేడు ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

మాగనూర్: మండల కేంద్రంలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరవుతారని మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దేశానికి సేవ చేయడమంటే అదృష్టంగా భావించాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

నారాయణపేట రూరల్: బలమైన ఆహారంతో దేహదారుడ్యాన్ని పెంచుకోవాలని ప్రముఖ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కార్తీక్ గందె, డాక్టర్ అమృత్ విద్యార్థులకు సూచించారు. వారియర్స్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉచిత అగ్ని వీర్ శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో విద్యార్థులకు మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎత్తు, బరువు, ఈఎన్‌టీ, డెంటల్, కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సేవలో భాగం కావడం అంటే ఎంతో గొప్ప విషయమన్నారు. పుట్టి పెరిగిన ఊరికి, దేశానికి సేవ చేయడమంటే అదృష్టంగా భావించాలన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

వారియర్స్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉచిత ఆర్మీ అగ్ని వీర్ శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులను ఉద్దేశించి భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కే. రాజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి రక్షణ రంగంలో ఉద్యోగాలు రావాలని ఆకాక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో వారియర్స్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ రవికుమార్, ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ గగన్, వారియర్స్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

లక్ష్యం పెట్టుకొని చదువుకుంటేనే ఫలితం



నారాయణపేట రూరల్: పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను ఆదివారం మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ సంఘం ఆధ్వర్యంలో ఎంపీకే కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను ఎంపిక చేసి వారిని శాలువాతో సన్మానించి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచి లక్ష్యం పెట్టుకొని చదువుకుంటే ఉన్నత స్థానానికి చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, కాంగ్రెస్ నాయకులు యూసఫ్‌తాజ్, జుబేర్, సర్ఫరాజ్ అన్సారీ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మరికల్: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో 2003–04లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ పాఠశాలలో కలుసుకొని ఆనందంగా గడిపారు. అలాగే అప్పటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఒకరి గురించి ఒకరు తెలుసుకున్నారు. అనంతరం తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

దామరగిద్ద: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2005–06 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనేక ఏళ్ల తర్వాత తాము చదువుకున్న పాఠశాలలోనే కలుసుకొని చిన్న నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి గురు ప్రేమను చాటుకున్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎం శంకరన్న, ఉపాధ్యాయులు అమృత్ తిప్పణ్ణ, సీతారాములు, శంభులింగం, చంద్రప్రకాశ్‌రెడ్డి, కాశప్ప పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

స్నేహితురాలికి ఆర్థిక సాయం


నగదును అందజేస్తున్న స్నేహితులు

దేవరకద్ర రూరల్: అనారోగ్యంతో భర్త మృతి చెంది, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తమ స్నేహితురాలికి ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు తోటి బాల్య స్నేహితులు. వివరాల్లోకి వెళితే.. కొకుంట్ల మండలం, పేరూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994–95లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు, అప్పట్లో తమతో కలిసి చదువుకున్న తమ స్నేహితురాలు వెంకటగిరికి చెందిన మంజుల భర్తను కోల్పోయి ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకొని ఆ కుటుంబానికి అండగా ఉండాలని నిశ్చయించుకున్నారు. అందరూ కలిసి రూ.50 వేలను పోగుచేసి ఆదివారం ఆమె ఇంటికి వెళ్లి నగదు అందజేశారు. భవిష్యత్‌లోను కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, సుదర్శన్, చంద్రశేఖర్, రాంరెడ్డి, నరేందర్, సాగర్, మన్యం, మధు, అనురాధ, కవిత, చంద్రకళ, పాల్గొన్నారు.

రామేశ్వరంలో చిన్నారి నృత్య ప్రదర్శన



అమరచింత: తమిళనాడులోని రామేశ్వరంలో నిర్వహిస్తున్న నృత్య ప్రదర్శనలో అమరచింత మండలానికి చెందిన ఇద్దరు చిన్నారులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. నటరాజ ఆర్ట్స్ అకాడమీ తిరుపతి వారు రామేశ్వరంలో నృత్య పోటీలు ఏర్పాటు చేయగా పాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఐశ్వర్య అంగవైకల్యం ఉన్నా కూచిపూడి నృత్యంలో సత్తా చాటింది. జైపూర్ పాదంతో నృత్య ప్రదర్శన ఇచ్చి పలువురి ప్రశంసలు అందుకుంది.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


సైకిల్ పోటీలను ప్రారంభిస్తున్న నర్సింహ గౌడ్

మక్తల్: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని మక్తల్ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నర్సింహగౌడ్ అన్నారు. సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు జిల్లా సైక్లింగ్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి గోపాలం ఆధ్వర్యంలో ఆదివారం సైకిల్ దినోత్సం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహగౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం చదువు మాత్రమే దృష్టి పెట్టకుండా క్రీడల్లోనూ రాణించాలన్నారు. అనంతరం మక్తల్‌లో నల్లజానమ్మ దేవాలయం దగ్గర మక్తల్ ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి, జిల్లా క్రీడల అధికారి వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి గోపాలం సైకిల్ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యాంజనేయులు, తాన్‌సింగ్ , పీఈటీలు విష్ణువర్ధన్, రమేశ్ కుమార్ పాల్గొన్నారు.

ఆపరేషన్ 'కగార్' నిలిపివేయాలి



ఆత్మకూర్: ఆపరేషన్ కగార్ పేరిట కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను అణిచి వేస్తుందని, విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు కుట్రలు పన్నుతున్నారని వామపక్షాల పార్టీల నాయకులు ఆరోపించారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు ప్రసాద్, రాజు, మోష, రాబర్ట్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని, బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలని, ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

3 నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు

అమరచింత: మండలంలోని మిట్టనందిమళ్లలో ఈ నెల 3 నుంచి 5 వరకు శ్రీశ్రీపాటిమీది ఆంజనేయ స్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. 3న జలాధివాసం, ప్రధాన దేవత హోమం, మహామంగళ హరతి, 4న ధాన్యాధివాసం ప్రతిష్ఠా హోమం, 5న యంత్ర ప్రతిష్ఠ, ధ్వజస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠాపన, కలశ విగ్రహ ప్రతిష్ఠాపనలు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే పూజల్లో భక్తులు, గ్రామస్తులు పాల్గొనాలని కోరారు.



గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శోభన్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో అనుమతి లేకుండా వందలాది ప్రైవేట్ పాఠశాలలు నడుస్తున్నాయని, రకరకాల పేర్లతో ఫీజులు దండుకుంటున్నారని పేర్కొన్నారు. వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సెంట్రల్ లైట్లకు మరమ్మతు చేయాలి

మరికల్: మండల కేంద్రంలో మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన సెంట్రల్ లైట్లు మరమ్మతులకు గురై వెలగడం లేదు. మహబూబ్‌నగర్, రాయిచూర్ రోడ్డుపై కిలోమీటర్ మేరా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ ఏడాది నుంచి ఒకటి పడితే మరొకటి పడడం లేదు. దారి పొడవున్న దాదాపు వందుల సంఖ్యలో లైట్లు పడకపోవడంతో జాతీయ రహదారిపై చీకట్లు కమ్ముకుంటున్నాయి. దీంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి పాడైన వాటి స్థానంలో కొత్త లైట్లను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రణాళికలు

ఆత్మకూర్: మున్సిపాలిటీ అభివృద్ధికి 100 రోజుల కార్యచరణను రూపొందించి ముందుకెళ్తున్నట్లు కమిషనర్ చికినె శశిధర్ అన్నారు. ఆదివారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో వార్డుల అధికారులు, సిబ్బందితో సమావేశమై యాక్షన్‌ప్లాన్ వెల్లడించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ అనంతరం పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. పారిశుద్ధ్యం, వనమహోత్సవం, ఇంకుడు గుంతల నిర్మాణాలు తదితర విషయాలపై పట్టణవాసులకు అవగాహన కల్పించనున్నామని వివరించారు. వార్డుల అధికారులు, సిబ్బంది అంకితభావంతో పట్టణ అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్లాలని సూచించారు.